


# రంభ ఊర్వశి మేనక

పోడ్లూరి సుబ్రహ్మణ్యం

అది అటు పల్లె, ఇటు పట్నమూకాని ఒక పెద్ద ఊరు. అక్కడ బస్సులున్నాయి కాని హైటెక్ బస్సులు లేవు. హోటలు ఉంది కాని, ఫైవ్ స్టార్ హోటలు లేదు. సినిమా హాలు ఉంది. కాని అది ఏ.సి. కాదు. కాలేజీ ఉంది కాని కోచింగ్ సెంటర్లు లేవు.

అలాంటి ఊళ్లోని ఆ కోఎడ్యుకేషన్ కాలేజీలో మాథ్స్ లెక్చరరు అనంత్. హాండ్సమ్‌గా ఉన్న ఆ బాచిలర్ లెక్చరర్ని చూస్తే, ఆ కాలేజీ టీచింగ్ స్టాఫ్‌లోని పెళ్లికాని ఉమన్ లెక్చరర్లకే కాదు, కాలేజీ అమ్మాయిలకు కూడా అంత క్రేజ్. అతని ఉపన్యాసం అద్భుతంగా ఉంటుంది. మెస్మరైజ్ చేయబడ్డట్లు విద్యార్థినీ విద్యార్థులు అతని లెక్చర్‌ని అంత శ్రద్ధగా వింటారు.

అతను ట్యూషన్లు చెప్పడు. అది అతని పాలసీ. క్లాసులోనే స్టూడెంట్సుకు చెప్పవలసినదంతా చెబుతాడు. అతని పాఠాలు అర్థంకాని వారు లేరు. అర్థం కాకపోయినా అడిగి చెప్పించుకునే వాళ్లంటే అతనికింకా ఇష్టం.

అలాంటి అనంత్ విచిత్రమైన పరిస్థితుల్లో ముగ్గురికి తప్పనిసరిగా ట్యూషన్లు చెప్పవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆ ముగ్గురూ రమ, ఉమ, మేరి. రమ తండ్రి ఒక కాంట్రాక్టరు. ఉమ తండ్రి ఒక బిజినెస్ మాగ్నెట్. మేరీ తండ్రి ఒక అధికారి.

ఆరోజు ఉదయం అనంత్ కాలేజీకి వెళ్ళడానికి తయారై పాంటు, షర్టు, టక్ చేసి, బూట్లు వేసుకొని, లేసులు కట్టుకుంటుండగా క్రింద ఇంటి ఓనరు రమ తండ్రి నుంచి పిలుపు వచ్చింది. టై కట్టుకొని, చేతిలో చిన్న హ్యాండుబాగుతో క్రిందికి దిగాడు.

అనంత్ వెళ్లేసరికి హాల్లో సోఫాలో కూర్చుని ఉన్నాడు రమ తండ్రి. ప్రక్కనే కాలేజ్ బుక్స్‌తో నిలబడి ఉంది రమ.

"రావయ్యా! రా! నీకోసమే చూస్తున్నా. నిన్ను చూస్తుంటే నాకు కాలేజి లెక్చరరువనిపించడంలా, సీనియర్ స్టూడ్ంటు వనిపిస్తున్నావు'' అంటూ నవ్వాడు రమ తండ్రి.

సిగ్గుతో తల వంచుకున్నాడు అనంత్.

"నిలబడతావేం. అలా సోఫాలో కూర్చో'' అంటూ ఎదురుగా సోఫా చూపించాడు రమ తండ్రి.

ఒక ప్రక్కగా ఒద్దికగా కూర్చున్నాడు అనంత్. రమ, తండ్రి ముందున్న టీపాయ్ మీద కాలేజీ బుక్స్ పెట్టి లోపలికి వెళ్లి కాఫీ తెచ్చింది.

మొహమాటపడుతున్న అనంత్‌తో "తీసుకోవయ్యా'' అంటూ మృధువుగా హెచ్చరించాడు రమ తండ్రి.

అనంత్ కాఫీ చప్పరిస్తుండగా "నువ్వు ఈ కాలేజీలో లెక్చరర్‌గా చేరిన ఈ నెల రోజుల్లో మా అమ్మాయి దగ్గర పదేళ్ల అభిమానం సంపాదించుకున్నావయ్యా. నీ దగ్గర ట్యూషను చెప్పించుకోవాలని అమ్మాయి ఉబలాటపడుతుందయ్యా. ఇప్పుటడు ఫస్టియరు డిగ్రీ. ఫైనలియరు కొచ్చేసరికి యూనివర్సిటీ ఫస్టు రావాలనేది అమ్మాయి ఆశ'' అన్నాడు.

"నేను ట్యూషన్లు చెప్పనండీ. అది నా నిర్ణయం. ఈ విషయం కాలేజీలో కూడా అందరికీ చెప్పాను''.

"కాలేజీ విషయం తీసెయ్యవయ్యా. నేను మాత్రం అందరికీ చెప్పమంటున్నానా. రమకి మాత్రమే చెప్పు. నేను నిన్ను గది అద్దె కూడా అడగను. అసలు నేను నీకు గది ఏ పరిస్థితుల్లో ఇచ్చానో ఒక్కసారి గుర్తు చేసుకో'' అన్నాడు రమ తండ్రి.

అనంత్‌కు అంతా గుర్తొచ్చింది. బ్రహ్మచారికి గది అద్దెకివ్వలేదు ఆ ఊళ్లో ఎవ్వరూ. ఎన్నాళ్లని హోటలు గదిలో ఉంటాడు. తన ఇబ్బంది క్లాసులో చెబితే ఎవ్వరూ కిక్కురుమనలేదు. కాని మూడోరోజే తనకు తనింట్లోనే మేడ మీద గది అరేంజ్ చేసానని, ఎప్పుడైనా వచ్చి చేరమని చెప్పింది రమ.

ఆ సాయంత్రమే తన హోటలు గది ఖాళీ చేసి, రమ ఇంటి మేడ మీద గదిలో చేరాడు. తరువాత తనకు ఆ గది ఏ పరిస్థితుల్లో ఇచ్చారో తెలుసుకుని తెల్లబోయాడు. రమ తనకు గది ఇవ్వమని తన తల్లిదండ్రులను కోరిందట. బ్రహ్మచారికి గది ఇవ్వమని తల్లిదండ్రులు ఖరాఖండీగా చెప్పారట. దాంతో ఒకరోజంతా భోజనం చేయకుండా అలిగిందట. ఎవరెన్ని చెప్పినా వినలేదు. చివరకు తన లెక్చరర్‌కు గది ఇస్తామన్న తరువాతనే భోంచేసిందట. తనకు గది విషయంలో అంతటి త్యాగం చేసింది రమ.

తన వైపే సూటిగా చూస్తున్న రమను, 'విషయం చెప్పవయ్యా' అన్నట్లు బొర్రమీసాల మాటు చిరునవ్వును దాచుకున్న రమ తండ్రిని చూసి ఇక తన నిర్ణయం మార్చుకోక తప్పలేదు అనంత్‌కు. మరుసటి రోజు నుంచి ఆమెకు ఉదయం ఏడుగంటలనుంచి ఎనిమిది గంటలవలరకు ఒక గంట ట్యూషను చెప్పడానికి ఒప్పుకున్నాడు.

వారం రోజుల్లో క్లాసులో ఆమె ప్రతిభను చూసిన ఆమె స్నేహితురాళ్లు, బెంచి మేట్లు, ఉమ, మేరీ దానికి కారణం తెలుసుకున్నారు. తాము కూడా అనంత్ దగ్గర ట్యూషన్లు చెప్పించుకోదలచుకున్నారు. ఉమ తండ్రి ఒక గొప్ప బిజినెస్ మాగ్నెట్. మనిషి ద్వారా అనంత్‌ని ఇంటికి పిలిపించాడు. విషయం ఊహించిన అనంత్ వెళ్లలేదు. ఇంట్లో ఉమ వత్తిడి ఎక్కువయ్యింది. ఇక తట్టుకోలేక ఆమె పుట్టినరోజని ఆ సాయంత్రం పెద్ద డిన్నర్ ఏర్పాటు చేశాడు ఉమ తండ్రి. ఉమ తన స్నేహితురాండ్రు రమని, మేరీని, లెక్చరరు అనంత్‌ని కూడా ఆహ్వానించింది. వెళ్లదలచుకోలేదు అనంత్.

రమ తండ్రి "వెళ్లకుంటే బాగుండదయ్యా. అతను నా స్నేహితుడు'' అంటూ బలవంతంగా తన కారులో రమతోబాటు అనంత్‌ను కూడా ఎక్కించుకొని వెళ్లాడు.

అక్కడకు వెళ్లిన తరువాత అనంత్ తెలుసుకున్న దేమిటంటే రమ తండ్రి, ఉమ తండ్రి దగ్గర కాంట్రాక్టు పనులకు డబ్బు అప్పు తెస్తుంటాడని, ఉమకు ట్యూషను ఇప్పించే బాధ్యత రమ తండ్రికి అప్పగించాడని. ఉమ వేడికోలుకయితేనేమి, ఉమ తండ్రి, రమ తండ్రిల రెక్వెస్టుల కయితేనేమి అనంత్ ఉమకు ట్యూషను చెప్పడానికి ఒప్పుకున్నాడు. ఆ గ్రాండ్ డిన్నరు అయిన తరువాత ఎవరిళ్లకు వాళ్లు వచ్చేసారు.



ఇది జరిగిన వారం రోజులకు ఓ ఉదయం కొత్త స్కూటరులో వచ్చింది మేరి. ఆ సమయంలో అనంత్ రమకు ట్యూషన్ చెబుతున్నాడు.

"గుడ్ మార్నింగ్ సార్. మీరు స్కూటరు లోనుకు అప్లికేషను పెట్టారా" అంటూ గదిలోకి వచ్చింది మేరీ.

ఆమె హఠాత్ ఆగమనానికి ఆశ్చర్యపోతూ, "అవును. నీకెలా తెలుసు?" అన్నాడు.


"బ్యాంక్ మేనేజరు మా నాన్నగారేలే".

"ఆయన ఇవ్వ నన్నాడుగా".

"ఆయన అనడ మేమిటి? మీ లోను నిన్ననే శాంక్షను చేయించాను. చెక్ తీసుకెళ్లి కంపెనీలో ఇచ్చేసి మీ తరఫున స్కూటరు కూడా తీసుకొచ్చాను. ఇవిగోండి కీస్" అంటూ స్కూటర్ కీస్ అలవోకగా అనంత్ వైపు విసిరింది.

"సర్‌ప్రయిజ్" అంటూ వాటిని నాజూకుగా అందుకున్నాడు అనంత్.

అతని చిరకాల వాంఛ నెరవేరింది. ఇక




స్కూటరు మీద కిలోమీటరు దూరంలో ఉన్న కాలేజీకి బట్ట నలక్కుండా వెళ్లవచ్చు.

"థాంక్స్ మేరీ. నువ్వింత సహాయం చేస్తావని అనుకోలేదు."

"ఇంత సహాయం చేసినందుకు నాకు థాంక్స్ వద్దు. నాకూ ఒక సహాయం చేయండి"

"చెప్పు ఏదయినా చేస్తాను".

"ప్రామిస్".

"ప్రామిస్".

"అయితే రేపట్నుంచి. నాకు కూడా మా ఇంటికి వచ్చి ట్యూషన్ చెప్పండి".

"నేను చెప్పనని చెప్పాను కదా."

"ప్లీజ్. ఇంత కష్టపడి మా నాన్నను బ్రతిమాలి మీకు లోను ఇప్పించింది ఇందుకా సార్" ఏడుపు ముఖంపెట్టి అంది మేరీ.

రమ కూడా కలుగ జేసుకొని "సార్, మేం ముగ్గురం క్లాసుమేట్సు, బెంచిమేట్లమే కాదు. క్లోజ్ ఫ్రెండ్సమి కూడా. మేం ఇద్దరం ట్యూషన్ చెప్పించుకొంటూంటే అదొక్కటే బిక్కు బిక్కుమంటూ ఉండడం మాకు బాధగా ఉంది సార్" అంటూ బ్రతిమాలింది.

"ఇలా చెప్పుకుంటూ పోతే చివరకు ఓ పాతికమంది తయారవుతారు"

"ఇక ఎవరికీ చెప్పవద్దు సార్. మా ముగ్గురికే చెప్పండి చాలు" అంటూ బ్రతిమాలడం మొదలుపెట్టారు ఇద్దరూ.

ఆమె తనకు లోను సహాయం చేయడం వల్లనయితే నేమి, ముగ్గురూ బెంచిమేట్లు అవడం వల్లనయితేనేమి, చివరకు ఆమెకు కూడా ట్యూషను చెప్పడానికి ఒప్పుకున్నాడు అనంత్.

రోజులు గడుస్తున్నాయి. నెలనెలా ట్యూషను చెప్పించుకొంటూ మంచి మొత్తం ముట్టజెపుతున్నారు ముగ్గురూ.

ఉదయం ఏడుగంటల నుంచి ఎనిమిది గంటల వరకూ ట్యూషను. ఉదయం తొమ్మిది గంటలకు వెలితే మధ్యాహ్నం ఒంటి గంటకు కాలేజ్ నుంచి వస్తాడు. ఒక పూటే కాలేజి. మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు వరకు ఉమకు ట్యూషను. అయిదు నుంచి ఆరు వరకు మేరీకి ట్యూషను. ఇదీ అనంత్ దినచర్య. వాళ్ల అందంవల్ల నయితేనేమి అలవాట్లవల్ల నయితేనేమి, వాళ్ల చనువు వల్లనయితేనేమి ఆ ముగ్గురు అమ్మాయిల పట్ల ఆకర్షితుడయ్యాడు కుర్రవాడైన అనంత్.

రమ తెల్లగా, అందంగా, బొద్దుగా ఉంటుంది. గుండ్రని ముఖం, విశాలమైన కళ్లు, అందమైన ముక్కు, ఎర్రని దొండపండులాంటి పెదవులు. ఎంతసేపు చూసినా, తనివితీరని ముఖబింబం ఆమెది. అందంగా అలంకరించుకోవడం ఆమెలోని ప్రత్యేకత. ఆమె కళ్లలోకి చూసినప్పుడు ఏదో మైకం కమ్మేది అనంత్‌కి. తనను తాను నిగ్రహించుకొంటూ పాఠం చెప్పేవాడు. ఏకసంథాగ్రహి రమ.

ఉమది స్ట్రక్చరల్ పర్సనాలిటీ. సన్నగా పొడవుగా, పసుపుకొమ్ము రంగులో ఉంటుంది. పెద్ద పెద్ద కళ్లు, ఆకర్షణీయమైన ముఖవర్చస్సు. ఆమె ఒక సంగీత కళాకారుని వద్ద భరతనాట్యం నేర్చుకుంటూ ఉంది. అందుకే ఆమె నడుస్తూంటే నాట్యం చేసినట్లు ఉంటుంది. ఆమె నడిచేటప్పుడు వెనుకనుంచి చూస్తే మతిపోయేది అనంత్‌కి. ఆ లయబద్ధమైన నడక, జడ ఊపులు అతన్ని మరోలోకంలోకి తీసుకుపోయేవి. ఆమె పాఠం వింటూనే 'ఆపనుంది సార్, ఈ పనుందిసార్' అంటూ గదిలోంచి అటూ ఇటూ వెల్తుండేది. ఆమె నడక చూస్తేనే తను ధన్యమై పోయినట్లు భావించే అనంత్ ఆమెను కాదనేవాడు కాదు. ఆమె వెల్తూంటే ఇష్టంగా చూసేవాడు. ఇంత చేసినా ఆమె చదువులో తన స్నేహితురాళ్లతో సమానంగా మార్కులు తెచ్చుకునేది.

ఇకపోతే మిగిలింది మేరీ. మనిషి చామనఛాయగా ఉంటుంది. శరీరంలోని అందాలన్నీ భారీగానే ఉంటాయి. రంగులేకపోయినా ఆకర్షణీయంగా ఉంటుంది. ఎప్పుడు శుచిగా, శుభ్రంగా ఉంటుంది. ఇతను ఆమె ఇంటికి వెళ్లేది సాయంత్రం పూట. అప్పటికే ఆమె స్నానం చేసి, ఒళ్ళంతా స్ప్రే చేసుకొని నైట్‌గౌన్‌లో దర్శన మిచ్చేది. మేరీలోని ప్రత్యేక ఆకర్షణ ఆమె టోన్. ఆమె గొంతు విప్పితే నవరత్నాలు రాలినట్లుంటాయి. కళ్లు మూసుకొని ఆమె మధురమైన గొంతు వింటూ నిద్రాహారాలు మానివేసి ఏళ్ల తరబడి జీవించవచ్చు అనుకుంటాడు అనంత్. అంత మధురమైన గొంతు ఆమెది.

వీళ్ల అందాలకు మురిసిపోయిన అనంత్ వాళ్లకు రంభ, ఊర్వశి, మేనక అని పేర్లు పెట్టుకుని ఊహల్లో తేలిపోతూ కలలు గనసాగాడు. ముగ్గురూ మూడు విధాలుగా అతన్ని వేడెక్కించసాగారు.

రోజులు గడుస్తున్నాయి. రమ అనంత్‌తో చాలా క్లోజ్‌గా ఉండేది. ఒక ఆడస్నేహితురాలుతో ఉన్నంత చనువుగా అతన్ని రాసుకుంటూ, పూసుకుంటూ తిరిగేది. ఆరోజు రమ తమ్ముడితో గొడవపడింది. దాంతో వాడు ఆమె పుస్తకాన్ని పాత సామానుల గదిలో దాచేశాడు. అది తెలిసిన రమ పాత సామానుల గదిలో దూరి ఎలాగయితేనేం ఒక అరగంటలో దాన్ని పట్టేసింది.

తరువాత అనంత్ గదిలోకి వచ్చి అతన్ని ఆనుకొని వెనక్కు తిరిగి నిలబడింది. "మాస్టారూ, వెనుక బూజు అంటుకొని ఉంటుంది. నాకు కనిపించదుగా. మీరు విదలగొట్టండి." అని కోరింది.

ఆమె అంత దగ్గరగా తన వేపు చూసి నిలబడే సరికి అనంత్ నరాలు జివుమన్నాయి. ముందు తలమీద బూజు తీసాడు. నున్నని మెడ తడిమాడు. మెత్తని వీపును బూజు తీస్తూ, సున్నితంగా నిమిరాడు. వెనుక వృష్టభాగాన్ని తడుతూ బూజు దులిపాడు. అలాగే క్రింద వరకూ తడుముతూ దుమ్ము విదలగొట్టాడు. అనంత్ తడుముతూంటే ఆమె, 'చక్కలిగిలి మాస్టారూ, చక్కలిగిలి' అంటూ కథాకళి నృత్యం చేసింది. అనంత్మాత్రం బూజు నెపంతో ఆమె శరీరాన్ని పదేపదే తడిమి ఆ స్పర్శలో ఉన్న మధురానుభూతుల్ని స్వంతం చేసుకున్నాడు.

ఒక నెల తరువాత అనంత్ ఒకరోజు ఉమ ఇంటికి వెళ్లేసరికి ఆమె టేప్‌రికార్డరులో పాట పెట్టుకొని హాల్లో నృత్యం చేస్తూ ఉంది. ఇంట్లో ఎవరూ ఉన్నట్లు లేరు. ఎదురుగా ఉన్న అనంత్‌ను కూడా గమనించలేదు. నాట్యం చేస్తూ క్లైమాక్సులో "కృష్ణయ్యా" అంటూ ఎదురుగా ఉన్న అనంత్ మెడ చుట్టూ చేతులు వేసి కౌగలించుకొని, కృష్ణుడ్ని కౌగలించుకొని రాధ పారవశ్యం చెందినట్లు పారవశ్యం చెందింది ఉమ.

అనంత్ కయితే నరాలు స్వాధీనం తప్పాయి. తన మెడను చుట్టుకున్న రెండు చేతులు, తన ఎదపై ఆమె మెత్తని ఎద. తనను అణువణువునా చుట్టుకున్న ఆమె అందాలు. ఆయాచితంగా అతని చేతులు ఆమె నడుమును చుట్టి తనవైపు అదుముకున్నాయి. అయిదు నిముషాలకు గాని ఈ లోకంలోకి రాలేదు ఉమ.


చేతులు వదిలేసి, తనను విడిపించుకొని దూరంగా జరిగి తలవంచుకొంది ఉమ.

"సార్. మాస్టారూ. నేను నాట్యంలో నన్ను నేనే మరచిపోతాను. శ్రీకృష్ణుడ్ని కౌగలించుకొన్నట్లు నటిస్తూ నాట్యంలో లీనమయిపోయిన నేను కృష్ణయ్య రాధను అల్లుకొన్నట్లు మిమ్మల్ని అల్లుకొనిపోయాను. ఏమనుకోరు గదా".

"అయ్యయ్యో. అలా ఎందుకనుకుంటాను ఉమా. కాకపోతే ఈరోజు ఏమీ తోచక అరగంట ముందుగా నీకు ట్యూషను చెప్పడానికి వచ్చాను"

"నిజంగా మీరు తిడుతారేమో ననుకొన్నాను మాస్టారూ" బుంగమూతి పెట్టి భయంగా అంది ఉమ.

'నువ్వు రోజూ ఇలా కౌగలించుకొంటానంటే రోజూ అరగంట ముందుగానే వస్తాను' మనసులోనే అనుకొన్న అనంత్, "నీ నాట్యం మెచ్చుకోవాల్సిన విషయం. తిట్టాల్సిన విషయం కాదు" అని, "వెళ్లు. రెడీ అయిరా. ట్యూషను చెబుతాను" అన్నాడు.




రోజులు గడుస్తున్నాయి. ఆదివారాలు ఎవరికీ ట్యూషను చెప్పడు అనంత్. ఆరోజు పూర్తిగా రెస్ట్. సినిమాకు వెల్తుంటాడు. అలవాటు ప్రకారం ఆ ఆదివారం సాయంత్రం కూడా సినిమాకు బయలుదేరాడు. థియేటర్ ముందు జనం గుంపుగా ఉన్నారు. ఈరోజే సినిమా రిలీజయినట్లుంది. బుకింగ్ దగ్గర కొండవీటి చాంతాడంత క్యూ. ఆ క్యూలో నిలబడి టికెట్టు తెచ్చుకోవడమన్నది దుర్లభం. ఇక లాభంలేదని వెనుకకు తిరిగాడు అనంత్.

నాలుగు అడుగులు వేసాడో, లేదో వెనుకనుంచి "మాస్టారూ" అన్న కేక వినబడింది.

ఇటు తిరిగిన అనంత్‌కు, కొద్ది దూరంలో టికెట్లు పట్టుకుని నిలబడి ఉన్న మేరీ, ఆమె తమ్ముడు కనిపించారు. వాళ్లని సమీపించాడు అనంత్.

"మాస్టారూ. సినిమాకు వచ్చారా. నా దగ్గర రెండు టికెట్లున్నాయి లెండి. మా తమ్ముడిని ఇంటికి పంపించేస్తాను" అంటూ తమ్ముడ్ని ఇంటికి వెళ్లిపొమ్మంది.

"అరె. ఆ అబ్బాయిని ఎందుకు ఇంటికి పంపడం పాపం" నొచ్చుకున్నాడు అనంత్.

"ఫరవాలేదు మాస్టారూ. వాడు ఈరోజు కాకపోతే రేపు చూస్తాడు. మీరు వారానికి ఒక్కసారే గదా సినిమాకు వచ్చేది" అంటూ సర్ది చెప్పింది.

మేరీ తమ్ముడు ఇంటికి వెళ్లిపోతే, మేరీ, అనంత్ ఆ టికెట్లతో సినిమా థియేటర్‌లోకి నడిచారు. ఇద్దరూ ప్రక్క సీట్లలో కూర్చున్నారు. అది ఆవూరికి మాత్రమే కొత్త సినిమా. నిజానికి అది పదేళ్ల క్రితం ఫస్ట్ రిలీజయ్యింది. సినిమా బాగుంటుందనుకు న్నారు గాని, ఇంత బోరు కొడుతుందని అనుకో లేదు. ప్రక్కనే మేరీ ఉండడం వల్ల అనంత్‌కి సినిమా బోరు తెలియడం లేదు. మేరీ చేతిని తన చేతుల్లోకి తీసుకొని వాచీ సర్దుతూ, వ్రేళ్లు నిమురుతూ కాలం గడుపుతు న్నాడు.

ఇంటర్వెల్ అయింది. "మాస్టారూ ఈ బోర్ సినిమా చూళ్లేకున్నాను. వెల్దాం పదండి" అంది మేరీ.

అనంత్‌కు కూడా అలాగే ఉంది. అనంత్ స్కూటర్ బయటకు తీసాడు. వెనుక కూర్చొంది మేరీ. మేరీ సలహా ప్రకారం స్కూటర్ని పార్కువైపు దారి తీయించాడు.

ఎవరూ లేని చోట పచ్చ గడ్డిలో ఇద్దరూ కూర్చు న్నారు. పార్కులోని దీపం కాంతి పలుచగా వీరి మీద పడుతోంది.

"మాస్టారూ. నా గొంతు చాలా స్వీట్‌గా ఉంటుందని అంటుంటారు గదా. పాత సినిమా పాటలు కొన్ని పాడుతాను. వింటారా" అంది మేరీ అనంత్ కళ్లలోకి చూస్తూ.

"అంతకంటేనా" ఎగిరి గంతేసాడు అనంత్.

తను అడగబోయే ప్రశ్న ముందుగానే



## భవిష్యత్‌రచన

"నేను ప్రేమిస్తున్నాను"

అంటూ తెలుగు సినీరంగంలోకి అడుగుపెట్టిన బెంగాలీభామ. అదేం చిత్రమో మావిడాకులు, కన్యాదానం, టోటల్‌గా ఇ.వి.వి. చిత్రాలన్నిటిలో ఎంత మంచి పాత్రలిచ్చి ప్రోత్సాహించినా ఒక చిత్రం హిట్ కాలేకపోయింది. సెంటిమెంటూ అంటే అది కాదు అంటుంది. ఎన్ని అపజయాలు ఎదురైనా తెలుగులో విజయం సాధించితీరతాను అని శపథం చేస్తోంది బెంగాలీభామ. చూడాలి ఇక బెంగాలీ సుందరిగా అవార్డు గెలుచుకున్న ఈ రచన భవిష్యత్‌రచన ఎలా చేస్తుందో!

- సాయిరాం

ఊహించి జవాబు చెప్పినట్లనిపించింది అతనికి.

ఆనందంగా వెల్లకిలా పచ్చగడ్డిలో పడుకొన్నాడు అనంత్. "అలాకాదు మాస్టారూ. ఇలా పడుకోండి" అంటూ అతనికి దగ్గరగా జరిగి అతని తలను తన ఒడిలో పెట్టుకుంది.

మెత్తని ఆమె ఊరువుల స్పర్శకు అతను పరవశించిపోయాడు. ఆమె తన మృదుమధురమైన కంఠస్వరంతో పాటలు పాడుతూ ఉంటే మురిసిపోయాడు. కళ్లు మూసుకొని ఏవేవో గంధర్వలోకాలలో విహరించాడు. ఆ రాత్రి గదికి చేరి పడుకొన్న అనంత్ ఈ అనుభూతి జన్మ జన్మలకు పదిల పరచుకోవాలనుకున్నాడు.

రోజులు, సంవత్సరాలు దొర్లిపోతున్నాయి. అంతా ఫైనలియరులో కొచ్చారు. ఈ మధ్య కాలంలో అనంత్‌కు ఈ రంభ, ఊర్వశి, మేనకలతో ఎన్నో అనుభూతులు, మరెన్నో మధురిమలు.

రమ, ఉమ, మేరీ ఫైనలియర్ పరీక్షలు వ్రాస్తున్నారు. ఈ పరీక్షలు అయిన తరువాత వాళ్లతో తనకు సంబంధాలు ఉండవు. ఈ ఆలోచనలు రాగానే అనంత్ మనసు బాధగా మూలిగింది. ఇప్పుడే తేలిపోవాలి. వీళ్లలో ఎవర్ని చేసుకున్నా తన జన్మ ధన్యమయిపోతుంది. అయితే వీళ్లలో ఎవరికి తనమీద ప్రేమ ఉందో, ఎవరు తనని చేసుకోవడానికి ఇష్టపడతారో అన్నది అతను ఊహించలేకపోతున్నాడు.

ఆరోజుతో ఆఖరు పరీక్ష అయిపోయింది. మరుసటి రోజునుంచి వేసవి సెలవులు. అందుకే వారి మనసులు తెలుసుకోవడానికి ముగ్గురికీ మూడు ప్రేమలేఖలు వ్రాసాడు. తను ఊరికి వెళ్లేముందు ఈ ఉత్తరాలు వాళ్లకి ఇవ్వాలి. ఏ విషయమూ తనకు సెలవుల్లో వాళ్ల దగ్గరనుంచి జవాబు అందుతుంది. అనుకున్నదే తడవుగా దాన్ని ఆచరణలో పెట్టాడు.

మొదట మేరీ ఇంటికి వెళ్లాడు. ఆమె లేదు. దగ్గరలో ఉన్న ఉమ ఇంటికి వెళ్లాడు. ఉమ ప్రశాంతంగా వాళ్ల నానమ్మతో కబుర్లు చెబుతూ ఉంది. స్కూటర్ ఆగిన శబ్దం విని లేచి నిలబడింది. లోపలికి వస్తున్న అనంత్‌ని చూసి రండి మాస్టారూ, మీ దగ్గరకే వద్దామనుకొంటున్నాను. నిన్నటితో పరీక్షల బాధ తీరిపోయింది గదా" అంది.

"ఇంతకీ పరీక్షలు ఎలా వ్రాసావు" అన్నాడు అనంత్ ఆమె కెదురుగా కూర్చొంటూ.

"చాలా బాగా వ్రాసాను. మాస్టారూ! అంతా మీ చలవే. ఇప్పుడే వస్తాను ఉండండి" అంటూ లోపలికి వెళ్లింది.

ఉమ నాయనమ్మ కూడా ఆమె వెంట లోపలికి వెళ్లింది. రెండు నిముషాల్లో ఫ్రిజ్‌లోంచి గ్లాసుతో జ్యూస్ తెచ్చింది.

ఎదురుగా టీపాయ్ మీద పెట్టి, "మళ్లీ వస్తాను మాస్టారూ" అంటూ లోపలికి వెళ్లింది.

కొద్దిసేపట్లో చిన్న దంతపు పెట్టె తెచ్చింది. అనంత్ జ్యూస్ త్రాగుతుంటే ఆమాటా ఈమాటా చెబుతూ ఉంది. అతను జ్యూస్ త్రాగడం పూర్తి కాగానే "మాస్టారూ! మీ చేయి ఇటు చాపండి" అంది.

అనంత్ తన చేయి చాపాడు. "మాస్టారూ. ఒక చిన్న గిఫ్ట్" అంటూ తన దగ్గరున్న చిన్న పెట్టె తెరచి, మెరిసిపోయే వజ్రపుటుంగరం ఒకటి బయటికి తీసింది. అనంత్ చేతిని తన చేతిలోకి తీసుకొని వ్రేలుకు వజ్రపుటుంగరం తొడిగింది.

"ఉమా! ఏమిటిదంతా" ఆశ్చర్యంగా అన్నాడు అనంత్.

"నా సంతోషం మాస్టారూ చూడండి ఈ వజ్రపుటుంగరం మీ వ్రేలికి ఎంత బాగా అమరిందో" అంటూ మురిసిపోయింది.

అనంత్ కాదనలేకపోయాడు. తన జేబులోని కవరు ఆమెకు అందజేసాడు.

"ఇదేమిటి మాస్టారూ"

"ఏమిటో రేపు చదువు. ఈ రాత్రికి నేను ఊరెళ్లిపోతున్నాను" అని ఆమె వద్ద సెలవు తీసుకొని నేరుగా మేరీ ఇంటికి వెళ్లాడు.

ఇతను వెళ్లేసరికి మేరీ ఇంటి వాకిట్లోనే నిలబడి ఉంది. "సార్. ఇందాక ఇంటికి వచ్చివెళ్లారట. నేను లేను. రండి లోపలికి" అంటూ ఆహ్వానించింది.

అనంత్‌తో తాను పరీక్షలు ఎంత బాగా వ్రాసింది చెప్పి మురిసిపోయింది. తరువాత లోపల్నుంచి ఒక సన్నని పొడవాటి పాకెట్ తీసుకువచ్చింది.

"సార్. ఇందాక షాపింగుకి వెళ్లింది దీనికోసమే. ఇది నా గురుదక్షిణ" అంటూ పాకెట్‌లోంచి మిలమిలమెరిసే ఎల్రక్ట్రానిక్ వాచ్ బయటకు తీసింది.

"మేరీ ఏమిటిదంతా" అంటున్నా వినకుండా అనంత్ చేతిని తన చేతిలోకి తీసుకొని, అనంత్ చేతికున్న పాతవాచీ తీసి పాకెట్‌లో పెట్టి, కొత్త వాచీ అతని ముంజేతికి తగిలించింది.

అద్భుతంగా ఉంది వాచీ. కనీసం మూడువేల రూపాయలు ఖరీదుంటుంది. తరువాత తమ్ముడిచేత కూల్‌డ్రింక్స్ తెప్పించింది. ఇద్దరూ మాట్లాడుకుంటూ త్రాగారు.


మేరీకి తను ఆ రాత్రికే ఊరెళ్తున్నట్లు చెప్పి ఆమె దగ్గర వీడ్కోలు తీసుకొన్నాడు. ఆమె, అనంత్ పాత వాచీ ఉన్న పాకెట్ అందిస్తే, దాన్ని జేబులో

## సింగర్‌గా జయప్రద

సెట్‌లో వున్నపుడు కూనిరాగాలు తీసే నటీమణుల్లో జయప్రద ఒకరు. వినడానికి చక్కగా ఉంటుంది. బావుందనే జయకృష్ణ 'సీతారాములు' చిత్రంలో జయప్రదతో ఓపాట పాడించారు. అప్పటికి 'బాలు' మంచి ఫామ్‌లో ఉన్నారు. పాటకి పదినిముషాలకంటే ఎక్కువసేపు సమయాన్ని కేటాయించలేనంత. లైట్‌షెడ్యూలు, రిహార్సల్స్‌లో బాగానే పాడిన జయప్రద 'టేక్' అనగానే బెరకు బెరకుగా పాడింది.

"ఏం ... ఎప్పుడు ఎంచక్కా పాడేదానివి. ఇప్పుడెందుకు భయపడ్డావు! అంటూ దాసరి ఏడిపించారు కూడా. అయితే తీరా పాట విన్నాక అలా బెరుగ్గా పాడటం మన పాటకో కొత్త అందం వచ్చిందన్నారు బాలు. సత్యం లాంటి సంగీతప్రియులు ... తర్వాత చాలా సినిమాల్లో పాడింది.

**- సాయిరాం**



పెట్టుకొని, జేబులో ఉన్న లెటరు ఆమె కందించాడు.

"మేరీ. దీన్ని జాగ్రత్త చేసి రేపు ఏకాంతంలో చదువు." అన్నాడు.

"సార్, కొంపదీసి ఇది లవ్ లెటరు కాదుకదా" కొంటెగా అని దాన్ని తన హ్యాండు బ్యాగులో భద్రపరచుకొంది.

అనంత్ జవాబివ్వకుండా అక్కడనుంచి గదికి బయలుదేరాడు. దారిలో స్కూటర్ని పార్సిలు వ్యానులో తన ఊరికి బుక్ చేశాడు.

అతను మేడమెట్లు ఎక్కుతుండగా పిలిచాడు రమ తండ్రి.

"ఏం మాస్టారూ! రాత్రికి మీ ఊరికి వెలుతున్నావటగా. ఈ రాత్రికి ఇక్కడే భోంచేయి" అన్నాడు. అది ఆజ్ఞతో కూడిన గంభీర స్వరం. దానికి తిరుగులేదు.

"అవునండీ. అర్ధరాత్రి పన్నెండు గంటలకు బస్సెక్కితే, తెల్లవారేసరికి మా ఊళ్లో ఉంటాను." అన్నాడు అనంత్.

ఆ రాత్రి ఎనిమిదిగంటల సమయంలో ఆ కుటుంబ సభ్యులతో కలసి భోంచేశాడు అనంత్. రమ కొసరి కొసరి వడ్డించింది. తను యూనివర్సిటీ ఫస్టు తప్పకుండా వస్తానని, దానికి కారణం తన మాస్టారేనని మరీ మరీ పొగిడింది.

భోంచేసి పైకి వెళ్లిన అనంత్ వెనుకనే వచ్చింది రమ. "మాస్టారూ మన బంధం ఈరోజుతో తెగిపోయింది. ఇక నన్ను కాలేజీకి వస్తానన్నా రానివ్వరు. మన బంధం తెగినా అనుబంధం కాకూడదని ఇదుగో దీన్ని గుర్తుగా తెచ్చాను" అంది.

"ఏమిటి?" అన్నాడు ఆశ్చర్యంగా గదిలోకి వెల్తూ.

అతన్ని విశ్రాంతిగా కూర్చోనిచ్చి, తరువాత తన చేతిలో ఉన్న రంగుల పెట్టె మూత ఓపెన్ చేసింది. అందులోంచి కళ్లు జిగేల్ మనిపించే ఓ గోల్డ్ చెయిన్ బయటికి తీసింది అడుగున పులి గోరుంది.

"మీకు పరీక్షలయిన తరువాత ప్రెజెంట్ చేయాలని మా అమ్మా, నాన్నలని పోరుపెట్టి నెల క్రితమే కొనిపెట్టాను".

"ఇది చాలా వేస్టు కదూ రమా".

"ఇరవై గ్రాముల బంగారు చెయిన్‌తో మేము నష్టపోయేది, మీరు కోటీశ్వరులు అయ్యేది ఏమీ లేదు. చెప్పానుగా మాస్టారూ మన అనుబంధానికి ఇది గుర్తని." అంటూ ఆ చెయిన్ తీసి తనే స్వయంగా అనంత్ మెడకి తగిలించి హుక్ పెట్టింది.

"అబ్బ ఎంత బాగుంది" అంటూ మురిసిపోయింది రమ. తరువాత అతనికి సూటుకేసు సర్దుకోవడంలో సాయపడింది. ఆమె వెల్తూంటే తను వ్రాసిన లవ్ లెటరు ఆమెకు అందించి, దాన్ని రహస్యంగా చదివి, జవాబు వ్రాయమన్నాడు. రమ అలాగేనని తలఊపి దాన్ని జాకెట్‌లో దాచుకొని వెళ్లింది. ఆ అర్ధరాత్రి గది వదలి తన ఊరికి ప్రయాణమైపోయాడు అనంత్.

వారం అనుకొన్నది పదిరోజులకు గాని ఉత్తరం రాలేదు. ఈ పది రోజులూ పది యుగాల్లా గడిపాడు అనంత్. పదోరోజు వచ్చిన ఆ ఏకైక ఉత్తరాన్ని సంబరంగా అందుకుని, హడావుడిగా చించి ఆతృతగా చదివాడు.

ప్రియమైన మాస్టారుకు,

అభినందన చందనాలు!

మీ ప్రేమలేఖలు చదివాము. ఎవరికి వాళ్లం ఉత్తేజితులమై మిగతా స్నేహితురాండ్రకు చెప్పుకోవడానికి ఆనందంగా బయలుదేరాము. కాని చూడబోతే మా అందరికీ ఇలాంటి ప్రేమలేఖలే అందాయి.

మాలో ఒకరైన రమను రంభగా వర్ణించి వ్రాసారు. ఆ ముఖారవిందం చూస్తేనే తరించి పోతుందని, దేవేంద్రుని కొలువులోని మేలిమి బంగారు రంగుగల రంభలా మిమ్మల్ని ఊరిస్తుందని తనను పెళ్లాడమని వ్రాసారు.

ఇకపోతే ఉమకు వ్రాసిన ప్రేమలేఖలో ఆమెను ఊర్వశిలా ఆరాధిస్తున్నానని, విహారానికి భూలోకానికి వచ్చిన ఊర్వశి మానవుడైన పురుషుణ్ని ప్రేమించి పెళ్లాడినట్లు తనను ప్రేమించి పెళ్లి చేసుకోమని, నాట్యంతో మీ గుండెల్ని రంజింపచేయమని కోరారు.

మేరీకి వ్రాసిన లవ్‌లెటర్లో కఠోరనియమ నిష్టాపరుడైన విశ్వామిత్రుడ్ని తపస్సు భంగం చేసిన సెన్సేషన్‌ల్ అందంలాంటి అందం మేనకదని, తనను ప్రేమించి తనను సంగీత మాధుర్యంతో జీవితాంతం ఓలలాడించమని కోరారు.

మాస్టారూ! మీరు ముగ్గురిలో మూడు రకాలయిన అందాలను ప్రేమించారు. ఆ మూడూ ఒకే వ్యక్తిలో ఉండుంటే మీ ప్రేమ నిజంగా సఫలమయి ఉండేది. ముగ్గుర్ని చేసుకోవడానికి ఇది దశరథమహారాజు కాలం కాదు. ముగ్గుర్ని మీరు చేసుకొని ముగ్గురి కోరికల్ని మీరు తీర్చలేరు. ఆర్థికపరంగానే కాదు. చట్టబద్ధం కూడా కాదు ఇది. ఊహల్లోనే తప్ప ఇది నిజ జీవితంలో జరగదు.

మేము ఏ ఒక్కరం మిమ్మల్ని చేసుకొన్నా మిగతా మీ కోరికలు గుర్తొచ్చి మేం సుఖపడలేం. అందుకే మేం ముగ్గురం మీ ప్రేమను తిరస్కరిస్తున్నాం. మమ్మల్ని మన్నించండి. క్షమించమని కోరుతూ, మీ శిష్యురాండ్రు,

రంభ, ఊర్వశి, మేనక

❋